ఉపాధి హామీ పథకంలో..

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- జిల్లాకు 1389 పనులు
- రూ.74 కోట్లు నిధులు
- ఇప్పటికే ప్రారంభించిన 900 పనులు

ప్రజాశక్తి- యాదమరి: ఎన్నోఏళ్లుగా రోడ్ల కోసం ఎదురుచూస్తున్న గ్రామీణ ప్రాంతాల ప్రజలు కలలు సహకారం అయ్యే సమయం రానే వచ్చింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపౌండెంట్ కింద సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2024 డిసెంబర్ 31తేదీ లోపు 100శాతం లక్ష్యాలను పూర్తిచేయాలను ఉద్దేశంతో పనులు చేపడుతున్నామని చిత్తూరు జిల్లా ఉపాధి పథక సంచాలకులు రవికుమార్ తెలిపారు.

జిల్లాలోని 31 మండలాలు, ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 1,389 పనులకి రూ.74 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 900 పనులకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు పనులు మొదలు పెట్టేసారు. ఇంకా 489 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఉపాధి పథకంలో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను వేగంగా చేపట్టేందుకు జిల్లా ఉపాధి పథక సంచాలకులు రవికుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పిడి మాట్లాడుతూ డిసెంబర్ 31 లోపు 100శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని ఉద్దేశంతో పనులు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టరు ఉపాధి పథకం కింద రోడ్లు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం జరగకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చేపడుతున్న సిసి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు వేగవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు పని ప్రదేశాలను స్వయంగా పరిశీలించి పనులు వేగవంతంగా ఏవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యాదమరి మండలం ఎర్రజోను గ్రామంలో సిమెంట్ రోడ్డు శిలాఫలం ప్రారంభిస్తున్నఎంఎల్ఏ మురళి మోహన్

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

రవికుమార్, ఉపాధి పథక సంచాలకులు

గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సిమెంట్ రోడ్లుకు నాణ్యత ప్రమాణాలను 100శాతం ఉండాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. డిసెంబరు 31 తేదీలోపు 100 శాతం పనులు పూర్తి చేస్తాం. రోడ్డు పనులకు సంబంధించి కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు వేయాలని తెలిపారు. అలాగే పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుంది.

అలంకారప్రాయంగా ఫాగింగ్ యంత్రాలు

- సచివాలయాల్లో అట్టపెట్టెల్లోకే పరిమితం
- ప్రజల అవస్థలను పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్యం మెరుగుతో పాటు దోమల నియంత్రణకు గత ప్రభుత్వం సచివాలయాలకు ఫాగింగ్ యంత్రాలను సరఫరా చేసింది. ప్రస్తుతం ఈ యంత్రాలు సచివాలయాల్లో అలంకారప్రాయంగా మిగిలాయి. జిల్లా అధికారులు మండలాల్లో సచివాలయాలకు అందించినా వీటి వినియోగంపై సరైన శిక్షణ అందించలేదు. ప్రస్తుతం గ్రామాల్లో దోమలమోత అధికంగా ఉంది దీంతో ప్రజలు పలు వ్యాధులకు గురికావాల్సి వస్తోంది. ఈ యంత్రాల ద్వారా దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటారని ఎదురుచూస్తున్న ప్రజలకు నిరాశే మిగులుతుంది.

ప్రజాశక్తి- పూతలపట్టు : ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా దర్శనమిస్తోంది. దోమల ఉత్పత్తి అధికంగానే ఉంది. ఈ క్రమంలో ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడుతూ ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఏమి పట్టించుకోకపోవడంతో గ్రామీణులకు అవస్థలు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు పోయేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది దీంతో దోమలు రోజురోజుకు వృద్ధి చెందుతున్నాయి దోమల నివారణకు వినియోగించాల్సిన ఫాగింగ్ యంత్రం సచివాలయాల్లో నుంచి బయటికి రావడం లేదు. సచివాలయాల్లో అసలు వాకింగ్ యంత్రాలు ఉన్నాయా అన్న అనుమానాలు సంబంధిత అధికారులకే వస్తున్నాయి. అట్టపెట్టెలకే పరిమితమైన ఫాకింగ్ యంత్రాలను బయటికి తీయాలని ప్రజలు కోరుతున్నారు.

బయటికి వచ్చేది ఎన్నడో..

పూతలపట్టు మండలంలో 25 పంచాయతీలు ఉండగా 17 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 252 గ్రామాలు ఉన్నాయి. గత రెండు సంవత్సరాల క్రితం ప్రతి సచివాలయానికి ఈ యంత్రాలను పంపిణీ చేశారు. కానీ ఇదివరకు చాలా సచివాలయాల్లో అట్టపెట్ట సీలు కూడా తీయని పరిస్థితి నెలకుంది. అసలే వర్షాకాలం అందులో దోమల తీవ్రత అధికంగా ఉన్నా సరే ఫాకింగ్ యంత్రాలు మాత్రం బయటికి రావడం లేదు. ఒకటి రెండు చోట్ల బయటికి తీసినా వినియోగానికి మాత్రం నోచుకోలేదు. మండలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో ప్రజలు విలవిలలాడుతున్న అధికారులు మాత్రం తమకేమీ ఎరుగునట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

- శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డి, పూతలపట్టు.

ఫాకింగ్ యంత్రాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడతాం. పారిశుధ్య కార్మికులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వాటిని వాడేలా చూడాలని సచివాలయ సిబ్బందికి చెప్పాం పరిశీలించి ఈ యంత్రాన్ని వినియోగించేలా చర్యలు చేపడతాం.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- విజయపురం (నగరి) ప్రజాసమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం ఆదివారం నగరి సత్రవాడ, తేరణి హరిజనవాడలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ సత్రవాడలో గ్రామకంతం కాలువపరంబోకు భూములు ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యక్తులు అ భూములను ఆక్రమణ గురిచేస్తూ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పెద్దలు, యువత గ్రామ అవసరాల కోసం గ్రంథాలయం ప్లేగ్రౌండ్ కావాలని పదేపదే అడుగుతున్నప్పటికీ స్థలాలు లేవని కుంటి సాకులు చెప్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా స్మశానం ఉన్నప్పటికీ ఆక్రమణకు గురైందని తెలిపారు. ఇంటిస్థలాలకు అర్హులు ఉన్నప్పటికీ స్థలాలు లేవని చెప్పడం సరికాదని విమర్శించారు. ప్రజలపై దౌర్జన్యాలు చేస్తున్న భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తేరణి దళితవాడలో ఇసుక మాఫియా చేస్తున్న తవ్వకాలవలను చుట్టుపక్కల బోర్లు అన్నీ కూడా కలుషితమై తాగునీరు కూడా కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. స్మశానానికి హద్దులు చూపినప్పటికీ స్కెచ్ ఇవ్వడం కానీ ప్రహరీ ఏర్పాటు చేయలేదని, వెంటనే గ్రామస్తులకు స్కెచ్ ఇచ్చి స్మశానాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన నాయకులు తంగరాజు, సందీప్, రాజా, లోకేష్, గుణశేఖర్, ఉమాపతి సంతోష్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి ఆదుకోండి..

ఉద్యోగులు, సిబ్బందిని ఆప్కాస్‌లో విలీనం చేయాలి

కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో 104 ఉద్యోగులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వేతన బకాయిలు చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయు) ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత శాఖలో పనిచేస్తున్న డేటాఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు ఆదివారం స్థానిక చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.విక్టర్, పి.మణికంఠ మీడియాతో మాట్లాడారు. గత 16 సంవత్సరాలుగా అరకొర వేతనాలతో బతుకుబండి లాగిస్తున్న తమకు అరబిందో సంస్థ యాజమాన్యం బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి జీవో నెంబర్-7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లును అరియర్స్ రూపంలో చెల్లించాలని, తమ 104 విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లో విలీనం చేయాలని కోరారు. వీటితో పాటు గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం జీవో నెంబర్ - 4459 మేరకు అరబిందో సంస్థ యాజమాన్యమే ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన పిఎఫ్, ఈఎస్ఐ వాటాను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, 104 వాహనాల ఫిట్నెస్, ఇన్సూరెన్స్ లను వెంటనే రెన్యువల్ చేయాలని, ముఖ్యంగా ఆయా డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే తమ విధులు నిర్వహించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము దశలవారీగా విధులను బహిష్కరించి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సంఘం గౌరవాధ్యక్షులు సురేంద్ర, కోశాధికారి భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, 104 ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులు హుసెన్, అసోసియేట్ అధ్యక్షులుగా పార్థసారథి, ఉపాధ్యక్షులుగా ఇబ్రహీం, సరిత, అశోక్, కోధికారిగా పన్నీర్ సెల్వం, కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, కిరణ్ కుమార్, జీవరత్నం, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపినాథ్, ఈసీ సభ్యులుగా ప్రవీణ్ కుమార్, మహేశ్వరి, మధుసూదన్, ఫణికుమార్ ఎన్నికయ్యారు.



రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు



ప్రజాశక్తి- వీకోట: ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు సాధ్యపడతాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత పరిస్థితులపై ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. తాను ఇప్పటివరకు రాజకీయంగా ఎన్నో పదవులు చేపట్టానని ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలతో తనకు ఎంతో సంతృప్తినిచ్చినా జిల్లా పరిషత్ చైర్మన్‌గా తన బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు.

ప్రజాశక్తి: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం అందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు.

జెడ్‌పి ఛైర్మన్: ప్రస్తుత పరిస్థితుల్లో పడమటి మండలాల్లో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి స్థానిక జిల్లా పరిషత్ సభ్యులు, నియోజకవర్గ శాసనసభ్యులు సూచనలు మేరకు ప్రతి నియోజకవర్గానికి సుమారు 2 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసామన్నారు. వీటిలో సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు తాగునీటికే వినియోగించాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో పూర్తిస్థాయి నిధులు తాగునీటి అవసరాలకు వినియోగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ గత ప్రభుత్వంలో చేపట్టిన నాడు -నేడు మొదటి, రెండవ దశలో దాదాపు 80శాతం పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన 20 శాతం పనులు నూతన ప్రభుత్వంలో మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపమన్నారు. నూతనంగా ఏర్పడిన స్కూలు కమిటీల సహకారంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్నం భోజనం పథకం అమలులో మెను ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన యూనిఫారం, పుస్తకాలు సకాలంలో అందించినట్లు తెలిపారు. రెండు ఎకరాలు స్థలం ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఈ ఏడాది సీజనల్ వ్యాధులు నివారించేందుకు కలెక్టర్ స్థాయిలో జిల్లా వైద్య అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా నివారించగలిగాం. క్షేత్రస్థాయిలో మురుగునీటి కాలువలు శుభ్రపరిచి, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించి, ఏఎన్ఎంల ద్వారా సర్వేలు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా అరికట్టినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు కొరతలేదన్నారు. అంగన్వాడీల సహకారంతో గర్భవతులకు పుట్టిన బిడ్డలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి: జిల్లాలో కరువును నివారించడానికి అవసరమైన నిధులు కోసం ప్రభుత్వానికి నివేదికలు ఏమైనా పంపారా..?

జెడ్‌పి ఛైర్మన్: పడమటి మండలాల్లో ఈ సంవత్సరం తగినంత వర్షం పడకపోవడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని అధిగమించేందుకు హంద్రీనీవా ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాము. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు, పార్లమెంట్ సభ్యుల సహకారంతో పూర్తిస్థాయిలో నిధులు సేకరించి వినియోగించి తాగునీటి సమస్యలను అధిగమిస్తాం. వీటితోపాటు పశు పోషణపై కూడా తగు చర్యలు తీసుకుంటాం.

ప్రజాశక్తి: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల సౌకర్యం మెరుగుపరచడానికి ఎటువంటి చర్యలు చేపట్టారు.

జెడ్‌పి ఛైర్మన్: జిల్లా పరిషత్ నుంచి ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన సుమారు రెండు కోట్ల రూపాయల నిధుల్లో సభ్యులు, శాసనసభ్యుల సూచనల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు సమన్వయపరచుకుని పూర్తిస్థాయిలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాం.

ప్రజాశక్తి: నూతన ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం ఏ విధంగా ఉంది.

జెడ్‌పి ఛైర్మన్: రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఎన్నికైన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నాం. వారి సూచనలు, సలహాలు మేరకు అధికారుల సంపూర్ణ సహకారంతో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందిస్తున్నాం.

ప్రజాశక్తి : ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా అన్ని ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ ఏమైనా రూపొందించారా..?

జెడ్‌పి ఛైర్మన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ప్రతి మండలానికి జడ్పిటిసి, నియోజకవర్గ శాసనసభ్యుల సూచనలు మేరకు అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయిస్తున్నాం. వీటికి అదనంగా ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా కేటాయించే నిధులు తాగునీటి సమస్యలు పరిష్కారానికి నూతనంగా సిసి రోడ్లు నిర్మాణంతో పాటు వివిధ ప్రజా అవసరాలకు పారదర్శకంగా నిధులు వినియోగిస్తున్నాం.

ప్రజాశక్తి: సొంత మండలం వీకోట అభివృద్ధికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి?

జెడ్‌పి ఛైర్మన్: జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి మండలంలో దాదాపు 80 శాతం మేరకు అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు విడుదల చేసి పూర్తి చేసాము. అవసరమైన అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా నూతనంగా బోర్లు వేసి సమస్యలు పరిష్కరించడం జరిగింది. పూర్తిస్థాయి పదవీకాలంలో 100శాతం నిర్దేశించుకున్న లక్ష్యాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తాను. రాబోవు కాలంలో ఉమ్మడి జిల్లాలోని శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు, ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను.

గిరిజనుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి మూర్తి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ గిరిజనులు, యానాదులు, ఎరుకలు, సుగాలి వంటి గిరిజనులను ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సంక్షేమ పథకాల లక్ష్యంగా గిరిజన సంక్షేమశాఖ పని చేస్తోందని, చిత్తూరు జిల్లాలో గిరిజన వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలు, గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలు, పెళ్లి కానుక, గిరిజనులకు రైతు భరోసా వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి మూర్తి తెలిపారు.

ప్రజాశక్తి: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఎలాంటి ప్రోత్సహం అందిస్తున్నారు?

అధికారి: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ రాస్తున్న వారికి ఉచితంగా కోచింగ్ ఇస్తున్నాం. కోచింగ్ సందర్భంగా ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నాం. డీఎస్సీ రాస్తున్న అభ్యర్థులకు ఎలాంటి సహయ సహకారాలు అందించడం జరుగుతోంది. ఈ ఏడాది ఎస్సీ, ఎస్సీ, డీఎస్సీ అభ్యర్థులు 300 మందికి పైగా ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతోంది.

ప్రజాశక్తి : గిరిజన సంక్షేమశాఖ లక్ష్యం ఏమిటి?

అధికారి : జిల్లాలో గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు గిరిజన వసతి గృహాల్లో ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, గిరిజనులు ఎదుర్కొనే భూ సమస్య ఇతర సమస్యలను పరిష్కరించడం, బ్యాంకు నుండీ ఉపాధి కోసం రుణాలు ఇప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది.

ఎస్. మూర్తి, జిల్లా గిరిజన సంక్షేమం సాధికారిత అధికారి

ప్రజాశక్తి : చిత్తూరు జిల్లాలో గిరిజనులు జనాభా ఎంత ఉంది?

అధికారి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ లెక్కల మేరకు 1,73,320 మంది వివిధ రకాల గిరిజనలు ఉంటున్నారు.

ప్రజాశక్తి : గురుకుల పాఠశాలు ఎన్ని వాటిలోని విద్యార్థులు ఎంత మంది?

అధికారి: ఉమ్మడి జిల్లా ఎనిమిది గిరిజన గురుకుల పాఠశాలల్లో 1,208 మంది బాలురు, ఐదు బాలికల గురుకుల పాఠశాలల్లో 1,389 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 199 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. 204 బాలికలు పది పరీక్షలు రాస్తే ఇందులో 185మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రజాశక్తి: గిరిజన వసతి గృహాలోని విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

అధికారి: జిల్లా ఇప్పటివరకు రెండు బాలురు గిరిజన కళాశాల వసతి గృహాల్లో 57 మంది వసతి పొందుతున్నారు. అలాగే ఆశ్రమ పాఠశాల్లో 64 మంది వసతి పొందుతున్నారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాల ఒకటి గిరిజన సంక్షేమశాఖ ద్వారా నడుస్తోంది. ఇందులో 17 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రజాశక్తి : జగ్జీవన్‌జ్యోతి పథకం అమలు ఎలా ఉంది?

అధికారి: గిరిజన కుటుంబాలకు 200 యూనిట్లలోపు గిరిజన కుటుంబాలకు ఉచితంగా జగ్జీవన్ జ్యోతి పథకం ద్వారా అందించడం జరుగుతోంది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ద్వారా రూ.206.20లక్షలను ప్రభుత్వం మంజురు చేసింది. రూ.18,750 లక్షల బిల్లులు అప్‌లోడ్ చేశాం. ఈ పథకం ద్వారా 25,780 గిరిజన కుటుంబాల లబ్ధిపొందుతున్నాయి.

ప్రజాశక్తి: పెళ్లికానుక పథకం ఎలా అమలు చేస్తున్నారు?

అధికారి: ఈ ఏడాది నుంచి చంద్రన్న పెళ్లికానుక పేరుతో గిరిజనులకు ప్రోత్సహం అందిస్తున్నాం. గిరిజనులకు గిరిజనేతరులు వివాహం చేసుకుంటే ప్రభుత్వ ప్రోత్సహం కింద ప్రస్తుతం రూ.1,20,000లు మంజూరు చేస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 65మందికి రూ.65.40 లక్షలు మంజురు చేయడం జరిగింది. అలాగే రైతు భరోసా అటవీ హక్కుల చట్టం ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70మంది గిరిజన రైతులకు రూ.7.14 లక్షలు మంజురు చేయడం జరిగింది.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దేశవ్యాప్తంగా రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న నిరంకుశ మోడీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు ఈనెల 26న కలెక్టరేట్ల వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.కాటమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరు ఎస్టీయు కార్యాలయంలో ఏఐటియుసి నగర అధ్యక్షులు దాసరి చంద్ర అధ్యక్షతన కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాటమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలు మెజారిటీ సీట్లు తగ్గించి తగు బుద్ధి చెప్పినప్పటికీ మోడీ విధానాల్లో ఏమాత్రం మార్పు లేదని, ప్రజా ఉద్యమాల ద్వారానే దారికి తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ దేశంలో అంబానీ అదానిల జపం చేస్తూ దేశసంపద మొత్తం ఇద్దరు, ముగ్గురు కార్పొరేట్లకు అందులోనూ సొంత రాష్ట్రమైన గుజరాతీయులకు పట్టం గట్టడం దుర్మార్గమన్నారు. దేశ సంపద ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో రూ.15లక్షల కోట్లు కార్పొరేట్ల పారు బకాయిలు రద్దుచేసి, రైతాంగం చిన్నచిన్న అప్పులను నడ్డి విరిచేలా దౌర్జన్యంగా వసూలు చేయడం చివరకు వారిని ఆత్మహత్యలకు పాల్పడేట్టు చేయడం మోడీ నైజంగా ఉందన్నారు. సంవత్సరం రోజులు రైతాంగం ఢిల్లీలో ఉద్యమిస్తే చివరకు తోకముడిచి క్షమాపణ కోరారు. తప్ప తిరిగి దొడ్డిదారిన ఆ చట్టాలను తీసుకొచ్చేందుకు పూనుకుంటున్నారని తెలిపారు. కనీస మద్దతు ధర పంటలకు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేసేందుకు నేటికీ ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. కార్మికులు ఎన్నో ఉద్యమాలకు పూనుకొని సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు చట్టాలుగా మార్పు చేయడం దారుణమన్నారు. కత్రిమ మేధ, నానో టెక్నాలజీ కారణంగా రోజువారీ పని గంటలు 8 నుంచి నాలుగు గంటలకు తగ్గించాల్సి ఉండగా దుర్మార్గంగా 12 గంటలకు పెంచడం కార్పొరేట్ల మేలు కోసమేనని అన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఓబుల్‌రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజానీకాన్ని సమీకరించి 26న కలెక్టరేట్ దిగ్బంధనం చేస్తామన్నారు. జిల్లాలో మామిడి రైతులను, పాడి రైతులను మోసం చేస్తూ గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. విజయడెయిరీని పునఃప్రారంభం, చక్కర ఫ్యాక్టరీని ప్రారంభించాలని ఉద్యమం చేపడతామని అన్నారు. నాయకులు సురేంద్ర, చంద్ర రమాదేవి, విజయ్‌గౌరి, దామోదరం, సురేంద్రనాథ్, సుబ్రమణ్యం, మునాన పాల్గొన్నారు.

మీ వద్ద రికార్డులు లేవు 'ఈ స్థలం మీది కాదు'

- ఇండోర్ స్టేడియం వద్ద చెలరేగిన వివాదం
- స్టేషన్‌కు చేరిన పంచాయతీ

ప్రజాశక్తి- పుంగనూరు: జూన్ నెల ఏడో తేదీన సుమారు రూ.80లక్షలు విలువ చేసే ఇండోర్ స్టేడియంను గుర్తు తెలియని వ్యక్తులు జెసిబిలతో నేలమట్టం చేశారు. అప్పట్లో పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్స్ షటిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు కూడా చేశారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు పోలీసులు దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆదివారం ఉదయం పుంగనూరు పట్టణానికి చెందిన కొందరు కూల్చివేసిన ఇండోర్ స్టేడియం వెనుక వైపు ఉన్న స్థలం తమకు సంబంధించినదని ఆ స్థలం వద్దకు జెసిబిలతో చదును చేసేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ షెటిల్ అసోసియేషన్ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. దీంతో వివాదం చెలరేగింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ స్థలం ఇండోర్ స్టేడియంకు సంబంధించిందని ఎటువంటి రికార్డులు లేవని స్థలాన్ని కబ్జా చేశారంటూ ప్రత్యర్థి వర్గీయులు గొడవకు దిగారు. గత 30 సంవత్సరాలుగా ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసుకుని షటిల్ కోర్టుగా వాడుకుంటున్నట్లు సభ్యులు చెబుతున్నారు. అయితే ఇది మీకు సంబంధం లేదంటూ ఇందుకు సంబంధించిన రికార్డులన్నీ మా వద్ద ఉన్నాయని వారు ఇండోర్ షటిల్ అసోసియేషన్ సభ్యులకు ఖరాఖండిగా చెబుతున్నారు. పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గత 30 సంవత్సరాలుగా షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మించబడి ఉంది. ఇండోర్ స్టేడియం కూల్చిన వెంటనే వారిపై చర్య తీసుకోవాలని పుంగనూరు పోలీసులకు, తహశీల్దార్, చిత్తూరు కలెక్టర్ వినతిపత్రాలు అందించడం జరిగింది. తర్వాత పలుమార్లు పోలీస్‌స్టేషన్ వద్దకు, తహశీల్దార్ వద్దకు వెళ్లి విచారించగా పరిశీలనలో ఉందని చెప్పారు. వారి సూచనల మేరకు షటిల్ కోర్టు బిల్డింగ్ కూల్చిన స్థలంలో తాము ఎలాంటి చర్యలు చేపట్టలేదని అసోషియేన్ సభ్యులు చెబుతున్నారు. పట్టణానికి చెందిన ప్రేమ్‌కుమార్ వారి అనుచరుగణం షటిల్ కోర్టు స్థలంలో జెసిబిని పెట్టుకుని స్థలాన్ని చదును చేయడం జరుగుతున్నదని సమాచారం రావడంతో షటిల్ కోర్టు సభ్యులందరూ అక్కడ చేరుకున్నారు. దయచేసి పనిని ఆపేయవలసిందిగా ఇది పార్టీలకు అతీతంగా క్రీడాకారులందరూ కూడా తమ సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్నామని బ్రతిమలాడడం జరిగింది. అప్పటికి తహశీల్దార్, పోలీస్‌స్టేషన్ సిఐ దగ్గరికి వచ్చి మాట్లాడిన అనంతరం మీరు మీ పనిని చేసుకోమని చెప్పాను, ఆయన ఆ విషయాలు ఏమీ వినకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం జరిగింది. అతను మీకు సంబంధం లేదని మీ వద్ద రికార్డు ఏమీ లేదని మమ్మల్ని దుర్భాషలాడి తమ పైన కేసులు బనాయిస్తామని చెప్పి బెదిరించడం జరిగిందన్నారు. షటిల్ కోర్టు సభ్యుడు శ్రీధర్ రెడ్డి సిఐకి ఫోన్ చేసి జరిగిన సంగతి వివరించగా పోలీసు వారు అక్కడికి రావడం జరిగినది వారు వచ్చి ఇరువర్గాలని పోలీస్ స్టేషన్ వద్దకు రావలసిందిగా ఆదేశించారు.

సిడిపిఓపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యేకి వినతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం నగరిలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకి వివరిస్తూ గత ప్రభుత్వంలో అంగనవాడీల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో 42 రోజులపాటు సమ్మె చేయడం జరిగిందన్నారు. ఆ సందర్భంగా మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అయితే నగరి ప్రాజెక్ట్ అధికారి వర్కర్లపై కక్ష సాధింపు చేపడుతూ మీరు చెప్పారనే ఉద్దేశంతో రాజీనామాలు చేయించే పని మొదలుపెట్టిందని మానుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సిడిపిఓపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, అధ్యక్ష కార్యదర్శులు షీలా, ధనకోటి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆజాద్ సేవలను స్మరించుకున్న ఎంపి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్వాతంత్ర దినోత్సవం కోసం పరితపించిన వ్యక్తిగా.. మత ప్రాతిపదికన భారతదేశం విడిపోవడాన్ని వ్యతిరేకించిన నిజమైన భారతీయునిగా.. కొనియాడబడుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త, దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్.. గొప్ప సమత.. మమత వాది అని కీర్తించారు. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని భారత దేశ వ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్న నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అబుల్ కలామ్ ఆజాద్ భారతావనికి అందించిన సేవలను ఆదివారం స్మరించుకున్నారు.

'వాల్మీకి బోయ ఫెడరేషన్ ఛైర్మన్‌గా బొజ్జమ్మను తొలగించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న పలమనేరు వాల్మీకి సంఘం నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: వాల్మీకి ఇతరులైన బొజ్జమ్మను రాష్ట్ర వాల్మీకి బోయ ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమించినందుకు పలమనేరు నియోజకవర్గ వాల్మీకి సంఘం తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం పలమనేరు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద వాల్మీకులు సమావేశమైయ్యారు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంవత్సరాల తరబడి వాల్మీకుల సమస్యలపై, హక్కులపై ఉద్యమాలు, ఆందోళనలు, కృషి చేసిన వారు ఎందరో ఉండగా (ఏకిల, పాల ఏకిర్రి) సామాజిక వర్గానికి చెందిన కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన బొజ్జమ్మను రాష్ట్ర ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్‌గా బొజ్జమ్మను తొలగించి వాల్మీకి, బోయలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఎల్ భాస్క, మాజీ సర్పంచ్‌లు నాగరాజు, గంగప్ప, డాక్టర్ సుబ్రమణ్యం, రామచంద్ర నాయుత్రి, శ్రీనివాసులు, గణపతి, వెంకట్రమ్, బాలాజి, శంకరప్ప, బాలక్రిష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ముస్లిం జేఏసీ అభినందన

విద్యార్థిని అభినందిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పూతలపట్టు నియోజకవర్గ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ అహ్మద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలీసు సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. మండల మొదటి బహుమతి జిల్లాలో ద్వితీయ బహుమతి సంపాదించిన బంగారుపాళ్యం సెంట్ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థి జబీన్ పోలీసులు సత్కరించడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థిని సత్కరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ముస్లిం ఐక్యవేదిక పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షౌకత్, ఉపాధ్యక్షులు బలిసిపల్లి బాబు, సెయింట్ మ్యారీ, కరెస్పాండెంట్స్, ఉపాధ్యక్షుడు రషీద్, ప్రధాన కార్యదర్శి ఇనాయతుల్ల, మాలిక్, పూతలపట్టు నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు ఏరాపలి ఉమ్మర్, అధికారా ప్రతినిధి జీలన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

స్తంభానికి అల్లుకున్న తీగలు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. ఆరోగ్య కేంద్రానికి ఈ దారిలో నిత్యం పాడి ఆవులను మేత కోసం రైతులు తోలుకుని వెళుతుంటారు. ఒక్కోసారి ఆవులు ఈ విద్యుత్ స్తంబాన్ని రాసుకుని వెళ్ళడంతో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. ఈ విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలను తొలగించాలని పలువురు రైతులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే ఈ తీగలను తొలగించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పాఠశాల అధ్యక్షులు దయానిధి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణ పరిధిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కుప్పం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫ్రాంక్, పాఠశాల ఛైర్మన్ దయానిధి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను 2026నూతన విద్యా సంవత్సరానికి ప్రారంభించినట్లు తెలిపారు. కుప్పం పట్టణంలో నూతన విద్యా విధానాలతో ఇంటర్నేషనల్ కరికులం, సీబీఎస్ఈ, కార్యాచరణ ఆధారిత సిలబస్ పాఠశాల ప్రత్యేకతలుగా ఉంటుంద న్నారు. కుప్పం లాంటి ప్రాంతంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రావడం శుభ పరిణామం అని ఫ్రాంక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం, ఐఆర్‌ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వ నమోదు

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని సూరిగానపల్లి పంచాయతీ తిమ్మనైన పల్లి గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జోరుగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు చేసుకోవడం వల్ల కలిగే లాభాలను ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ పార్టీ అధ్యక్షులు పాపన్న, మాజీ సర్పంచ్ శంకరప్ప, యూనిట్ ఇన్‌ఛార్జ్ బాలచంద్ర, నాయకులు చెంగప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదును నేతలు, కార్యకర్తలు చురుగ్గా నిర్వహించారు. ఆదివారం టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి క్రియాశీలక సభ్యత్వం ప్రతి ఒక్కరు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నాగరాజు, మణీ, రామలింగారెడ్డి, బాలరాజు, సుబ్రి, అల్లి శీన, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-చౌడేపల్లి: పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనకు స్థానిక ఉన్నత పాఠశాల వేదికగా మారింది. చిన్నతనంలో ఆడి పాడిన క్షణాలను గుర్తుకు తెచ్చుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పదవ తరగతి 1993-94 పూర్వపు విద్యార్థులు అందరూ ఒకచోట కలుసుకొని ఆనందంగా గడిపారు. విద్యను నేర్పించిన గురువులను తొలుత ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 30ఏళ్ల తర్వాత కలిసిన వారందరూ వయసు హోదాను మరచి రారా పోరా అంటూ పగలంతా ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడిపారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణను అందరూ కలిసి నిర్ణయించుకున్నారు.

బోయకొండ గంగమ్మ సేవలో ఎమ్మెల్యే



ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ గంగమ్మను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ దర్శించుకున్నారు. ఆలయ ఉప కమిషనర్ ఈవో ఏకాంబరం ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. వేద ఆశీర్వాదం అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. టీడీపీ నాయకులు సూపర్ మార్కెట్ హరి సాగర్ నాయుడు, కార్తీక్, పుంగనూరు, చౌడేపల్లి ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా ప్రతినిధులు, ఆలయ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాషోద్ధారకుడు సిపి బ్రౌన్

సమావేశంలో మాట్లాడుతున్న తులసినాథం నాయుడు

ప్రజాశక్తి-గంగవరం: ఒక ఆంగ్లేయ ఉద్యోగిగా ఉండి తెలుగు సాహిత్యానికి, భాషకు ఎనలేని సేవ చేసిన తెలుగు భాషోద్ధారకుడు బ్రౌన్ అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసి నాదం నాయుడు అన్నారు. ఆదివారం సిపి బ్రౌన్ జయంతి సందర్భంగా కళామందిరంలో బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో మూలనపడ్డ గ్రంథాలన్నింటిని సేకరించి తాళపత్రాలలో అవసర దశకు చేరుకున్న గ్రంథాలను సాహిత్యాలను తన సొంత నిధులతో పండితుల చేత పరిష్కరింపజేసి ముద్రించి తెలుగు జాతికి అందించిన తెలుగు సాహితీ కర్షుడ బ్రౌన్ అని కొనియాడారు. తెలుగు భాష అపురూప సంపదను వేమన పద్యాలను ముద్రించి వాటి ఆంగ్లంలో తర్జుమా చేయించి ప్రపంచానికి తెలియజే శాడన్నారు. ఆయన లేకుంటే తమకు అనేక గ్రంథాలు లభించేది కావని ఈనాటికి తెలుగు ఇంగ్లీషు.. నిఘంటువులు బ్రౌన్ తయారు చేయించినవేని అన్నారు. కార్యదర్శి పుష్ప, చంద్రశేఖర్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ గురించి మాట్లాడే హక్కు మీకు లేదు

- సోమల మండల టిడిపి నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-సోమల: ప్రోటోకాల్ గురించి మాట్లాడే హక్కు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు లేదని మండల టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం సోమల మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నూతన కూటమి ప్రభుత్వం సోమల మండలంలో ప్రజా ప్రతినిధులను ప్రభుత్వ కార్యక్రమాలలో, సమావేశాలకు ఆహ్వానించకుండా విస్మరిస్తున్నారని ప్రోటోకాల్ నియమ నిబంధనలను పాటించడం లేదని శుక్రవారం నిర్వహించిన సోమల మండల మీట్‌లో సర్పంచ్లు, ఎంపీటీసీలు అనడం సరైంది కాదన్నారు. ప్రోటోకాల్ గురించి మాట్లాడే హక్కు వారికి లేదని ఏ ప్రజలు ఓటు వేసి వారిని గెలిపించారో, ఏ విధంగా ప్రజాప్రతినిధులు అయ్యారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఏకగ్రీవ ఎన్నికలు చేసుకొని ప్రజా ప్రతినిధులుగా చలామణి అవుతూ తమపై అధికారులపై లేనిపోని అభాండాలు వేయడం మానుకోవాలని హితవుపలికారు. సోమల మండల టిడిపి అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఇరికిపెంట మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపీటీసీ రమేష్ నాయుడు, నాయకులు పాల మల్లికార్జున, చిన్న బాబు, పొదలగుంటపల్లి బాబు, శంకర, సదాశివ అడుసుపల్లి మణి అన్నారు.

టిడిపి నాయకులకు ఘన సన్మానం

మునిరత్నం, శాంతారామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం కంగుంది గ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు సమక్షంలో స్థానిక టిడిపి నాయకులు పిఎస్ మునిరత్నం, శాంతారామ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లుగా విధులు నిర్వహించిన పిఎస్ మునిరత్నంకు ఎపిఎస్ ఆర్టిసి ఉపాధ్యక్షులుగా, అలాగే శాంతారామ్‌కు టీటీడీ పాలకవర్గ సభ్యునిగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నిజాయితీకి నిదర్శనం అన్నారు. అయన కార్యకర్తలకు ఇచ్చిన మాట ప్రకారం పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు ప్రచారాలు

- టిడిపి సీనియర్ నేత గోపీనాథ్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ టిడిపి సీనియర్ నేత గోపీనాథ్ ప్రమాణం చేశారు. పట్టణంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ముందు ప్రమాణం చేస్తూ గతంలో జరిగిన పురపాలక సంఘం ఎన్నికలలో తాను అమ్ముడు పోలేదని, రాజకీయంగా తనను ఎదుర్కోలేక సొంత పార్టీకి చెందిన వారే తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా 2019 - 24 మధ్యకాలంలో వైసిపి హయాంలో కుప్పం పురపాలక సంఘం ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే, ఈ ఎన్నికలలో 16వ వార్డు టిడిపి అభ్యర్థిగా గోపీనాథ్ కుమారుడు హర్షధర్మతేజ, వైసిపి అభ్యర్థిగా డాక్టర్ సుధీర్ పోటీ చేశారు. కాగా వైసిపి అభ్యర్థి గెలుపొంది, అధ్యక్ష పదవిని కైవసం చేసుకుని, వైసిపి జెండా ఎగురవేశారు. ఈ క్రమంలో పలువురు తెలుగు తమ్ముళ్లు పురపాలక ఎన్నికలలో వైసీపీ నాయకులకు అమ్ముడుపోయారని పెద్ద ఎత్తున దుమారం లేచింది. ప్రధానంగా 16వ వార్డు టిడిపి అభ్యర్థి వైసిపి అభ్యర్థి నుండి పెద్ద మొత్తంలో సొమ్ము తీసుకుని టిడిపికి ద్రోహం చేశారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపించింది. గోపీనాథ్ తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక, కొంతమంది తనపై దుష్ప్రచారం చేస్తున్నట్టు గోపీనాథ్ విలేకరుల ఎదుట ఆరోపించారు.

శ్రీధర్ బాబుకు రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని మేలుమాయి పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీధర్ బాబు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయు లుగా శ్రీధర్‌ను ప్రకటించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను బెస్ట్‌గా తీర్చిదిద్దడంలో ఆయన ముందు ఉంటారని, గతంలో పత్తికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో సుమారు 80లక్షల రూపాయలతో పాఠశాలను సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందని సహోద్యోగులు తెలిపారు. ఏ పాఠశాలలో పనిచేసినా అక్కడ అన్ని విధాలుగా అభివృద్ధి చేయ డంలో ముందుంటారని, అంతే కాకుండా పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించి ముందుకు తీసుకెళ్ల డానికి కృషి చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవం లభించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

నాటు సారా స్వాధీనం

నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 12లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ నాగరాజా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. కుప్పం మండల పరిధిలోని నారామానుకొట్టాలు గ్రామానికి చెందిన విజయ, చిన్నబొబ్బ గ్రామానికి చెందిన కె పద్మలు అక్రమంగా నాటు సారా కలిగి ఉండడాన్ని గుర్తించామన్నారు. వారి వద్దనున్న నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేకంగా మత్తు పదార్థాలు రవాణా, క్రయవిక్రయాలు జరిపిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెదురుకుప్పం: రహస్యంగా నాటు సారా కాచి విక్రయిస్తున్న స్థావరాలపై పోలీసులు ఫోకస్ పెంచారు. ఆదివారం మండలంలోని వివిధ చోట్ల దాడులు నిర్వహించారు. మండలంలోని నక్కలాంపల్లి అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య తన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. సుమారు 2000లీటర్ల ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ విలేకరులకు తెలిపారు. 30లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు దార్యప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట పోలీసులు గంగయ్య, కళ్యాణ్, గణేష్ ఉన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని మొగిలిఘాట్‌లో ఆదివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి చెన్నై వెళ్తున్న లారీ నూతనంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పోలీస్ కంట్రోల్ క్యాబిన్ ఢీకొంది. ఈ సంఘటనలో విధులు చేపడుతున్న పోలీసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వన్నియకుల క్షత్రియ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తా

- సిఆర్ రాజన్ హామీ

సీఆర్ రాజన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వన్నియకుల క్షత్రియ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్ హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయంలో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సిఆర్ రాజన్‌ను వన్నియకుల క్షత్రియ నాయకులు, టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఆర్ రాజన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వన్నియకుల క్షత్రియ కులస్తుల అభివృద్ధి దృష్టిలో ఉంచుకుని, వారి సంక్షేమం కోరి వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తనను నియమించడం జరిగిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి నిధులు కేటాయించక, అభివృద్ధి చేయక నామ మాత్రంగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, సంఘం నాయకులు, ప్రముఖ న్యాయవాది త్రిమూర్తి, విజయ్‌కుమార్, ఉదయ్ కుమార్, పాండియన్, శంకర్, వినాయకన్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఏపీ వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ చిత్తూరు జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు సిఆర్ రాజన్ నియమితులైనారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన నివాసంలో వెదురుకుప్పం మాజీ మండల పార్టీ అధ్యక్షులు సింగం నాగరాజు రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిన శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

గంగాధర నెల్లూరు: వన్నికుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సిఆర్ రాజన్‌ను నియమించడంతో జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సిఆర్ రాజన్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. నాయకులు కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, బాబు నాయుడు, హరిబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిగా మహేష్ స్వేరో ప్రమాణస్వీకరం

ప్రజాశక్తి-యాదమరి: ఉన్నత విద్యని చదివి, వివిధ సంస్థలలో పనిచేసి మరింత ఎక్కువ మందికి చేరువవ్వాలన్న ఉద్దేశంతో విద్యార్థులకు పలు నైపుణ్యాలపై శిక్షణ అందిస్తూ దాదాపు దేశవ్యాప్తంగా ఎన్నో కళాశాలల్లో ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు, అన్ని చోట్ల సామాజిక కార్యక్రమాలు చేస్తూ విశిష్టంగా గుర్తింపు పొందిన ఐరాల మండలం, తిరువణంపల్లికి చెందిన మహేష్ స్వేరో రాజకీయాల్లో కూడా రాణిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. తన జీవితాన్ని ప్రజా సంక్షేమం కోసం, ప్రజల మేలు కోసం, మరింత రెట్టింపు స్థాయిలో సేవలు అందించాలన్న ఉద్దేశంతో న్యాయ శాస్త్రంలో పట్టా పొంది ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేశారు.